# శేషుతో షికారు

తనను సాయంకాలం తప్పకుండా షికారుకి తీసుక వెళ్ళాలని శేషమాంబ మధ్యాహ్నమే ఖట్టిగా వార్నింగ్ యిచ్చింది. ఎనిమిదేళ్ళుండని శేషుతో షికారు తమాషాగా వుంటుంది.

కుంటి ప్రశ్నలూ గుడ్డిప్రశ్నలూ వెయ్యని పక్షంలో తీసుక వెళ్తానని షరతు పెట్టాను. శేషు వొప్పుకుంది.

ఎండ చేటవాలుగా వున్నప్పుడు యిద్దరమూ షికారుకి బయలు దేరాం. మేము మా నందు మలుపు తిరుగుతుండగా ఒక పంది—అప్పుడే మా పట్నం మురికి కాలవలో శిరస్నానం చేసిన వరాహావతారం—మా కెదురయింది.

"మామయ్యా పంది మంచి శకునమేనా?" అంది శేషు.

నాకు మాత్రం ఈ శకునాల గురించి ఏమంత తెలుసు? అంబష్టుడు ఎదురుగా వస్తే వెళ్ళిన పని క్షవరం కాదనీ, మీదుమిక్కిలి వక్రమంగానూ

క్షేమదాయకంగానూ జరుగుతుందనీ అనుకోవడం రివాజు అని నాకు తెలుసు. బురదలో పొర్లి వచ్చిన వరాహం శుభశకునమా, అశుభశకునమా? శేషు అప్పుడే హద్దుమీరి వస్తోంది.

"హద్దుమీరి వచ్చువారు శిక్షింపబడును," అన్నాను.

ఆమె నవ్వుతూ, "లేదు. ఒక్కటే చెప్పు. ఇంకేమీ అడగను.'

చిన్నగా నవ్వుతూ ఆమె కుతూహలానికి జాలి పడ్డాను.

"పిల్లి ఎదురుగా వస్తే పని పాడవుతుందంటారు,—నిజమే కాదూ—మామయ్యా!"

"నిజమే!" అన్నాను, ఏమీ అనకుండా వూరుకునేందుకు వీల్లేక.

"అయితే, పంది?"

శేషు ఈ పందిని వదిలేటట్లు లేదు. ఆజంతువు మాకెదురవడం మంచో చెడ్డో తేలాలి. శేషు ఒక విషయం పట్టుకుందా కామారపుజీడిలా దాన్ని వదలదు. వూరుకోపెట్టేందుకు ఒకటే మార్గం. దగ్గర్లో వున్న పిప్పరమెంటు షాపువైపు నడవాలి. అంతటితో ఈ ధోరణి వదిలేసి ఆ తిండి హడా

వీధిలో పడుతుంది. కాని, నేను ఆ విషయాన్ని తప్పించాలని ప్రయత్నిస్తున్నానని గ్రహించిందా పోను చాక్‌లెట్లు కూడా పని చెయ్యవు.

"పంది మంచి శకునమే?" అన్నాను, విష్ణుమూర్తి ఒకానొకప్పుడు ఎత్తిన అవతారం చెడ్డదవుతుందా అనే విశ్వాసంతో.

"భలేగా వుంది," అంది శేషు చిన్నగా గెంతుతూ. "మనకి మాంచి శకునం అయింది."

ఎందుకో? పెళ్లికి వెళ్తున్నామా, పేరంటానికి వెళ్తున్నామా మంచికి!

శేషు నా చిటికెనవేలు పట్టుకు అణకువతో నడుస్తోంది. చిన్నపిల్లలతో షికారులో ఒక ప్రత్యేకత వుంది. స్నేహితులతో ఆషామాషీగా మాట్లాడుతూ నడవడం, పరిచయస్తులతో పిచ్చాపాటీగా రాజకీయాలు మాట్లాడుతూ నడవడం, పెద్దమనుషులతో వ్యవహారాలు మాట్లాడుతూ నడవడం, బాకీదార్లతో డబ్బు యిబ్బందుల గురించి మాట్లాడుతూ నడవడం — యివన్నీ ఒక రకం. అవి సర్వసామాన్యంగా అలవాటైన ఆనందాన్ని యివ్వలేకపోయే షికార్లు. ప్రపంచమంతా ప్రశ్నార్థకంగా వుండే చిన్నపిల్లతో కబుర్లాడు

తూనో, కలలు కంటూనో గాలిలో తేలిపోతున్నట్లు నడవడంలో మనస్సుని వుల్లాసపరిచే మాధుర్యం వుంది. శేషు నాకు అజేయుడైనా ప్రతాపం మీద ఘాటైన లెక్చరివ్వడు — టిమొషింకో సైనిక వ్యూహాల గురించి ధాటీగా మాట్లాడడు — హిందూలా సవరణ గురించి అసలే పట్టడు.

మెయిన్ రోడ్డు మీదికి వస్తున్నాం. జట్కా సాయిబు దూరాన్న వున్నాడు. మేము కనిపించగానే, "బండి కట్టనా, బాబూ!" అన్నాడు.

జట్కా సాయిబంటే శేషుకి అభిమానం. అతని గెడ్డం ఆమెకి చాలా యిష్టం. 'సాయిబు గెడ్డం బావుంటుంది, మామయ్యా. బ్లేడ్సుకోసం యింత యిబ్బంది పడుతున్నావ్ - నువ్వుకూడా గెడ్డం ఎందుకు పెంచుకోకూడదు ? — నేనాడుకునేందుకు భలేగా వుంటుంది," అని శేషు చాలా తఫాలు సలహా యిచ్చింది.

"బండి మీద షికారు వెళ్దాం," అంది.

"బండి మీద షికారుకి వెళ్లరు - నడచి వెళ్తారు," అన్నాను.

"బండి అయితేనేం?" అంది.

"మళ్లీ పొద్దు మీరుతున్నావ్!" అని వారించాను.

ఈలోగా జట్కాసాయిబు చవకగా వచ్చిన పచ్చగడ్డి బుంగ బేరమాడుతూ మా వునికిని మరిచాడు. అదే మాదిరిగా శేషు పది అడుగులు వెయ్యగానే జట్కాసాయిబూ, అతని అద్దాల బండీ, ఎగిరే గుర్రమూ మర్చిపోయింది.

పంపుల చెరువు దిక్కుగా బయలుదేరాం. నీడలు పొడుగ్గా, మరీ పొడుగ్గా, చాలా పొడుగ్గా చివరికి అదృశ్యమవుతున్నాయి. ఎర్రబడ్డయిన బింబం మునిగిపోతోంది. శేషూ నేనూ ఆ గట్టు మీద కూచుని నీళ్ళమీది నాచునీ, పైన ఎగిరే పక్షుల్నీ, పక్కని నడిచే మనుషుల్నీ పరికిస్తున్నాం.

శేషుకి ప్రశ్నలు వేసే అవకాశం లేదు.

వచ్చేస్తున్నాం. వెలుతురు యింకా బాగానే ఉంది. గొడ్లమందలు తప్పించుకుంటూ యింటి వైపుగా వస్తున్నాం.

శేషు టెన్షన్ భరించలేకపోతోంది. ఆమెకి కొద్దికొద్దిగా చికాకు కలుగుతోంది.

"మామయ్యా, షికారు అంటే యింత చప్పగా వుంటుందేం!"

"ఏం ?" అన్నాను, ఏమనాలో తెలీక.

"మాట్లాడకూడదనే షరతు షికారులోని మజా పాడుచేసింది. కోపం వస్తుందేమో అని మాట్లాడ లేదు."

"మంచి పని చేశావ్!"

"కబుర్లు లేకుండా షికారు బా వుం డ దు. పెరుగూ పప్పూ లేకుండా అన్నం తింటే తిన్నట్టు వుంటుందా? ఇలా అయితే నేనింకెప్పుడూ షికారుకి రాను."

"పోనీలే!" అన్నాను, కోపం ఆ చిన్న మొహానికి ఎలాటి అందం తీసుకు వస్తుందో చూదామని.

ఆకాశంలో ఒక మూల మబ్బులు దిట్టంగా కమ్ముకున్నాయి. దూరాన్న దుమారం లేచింది. మునిసిపాలిటీ శ్రమని తగ్గిద్దామనే సదుద్దేశంతో రోడ్లని శుభ్రపరచడానికి పూనుకున్నాడు గాలి దేవుడు. శేషు మొట్టమొదట కంగారు పడింది. కన్నీళ్ళ పర్యంతం అయింది. ధైర్యం చెప్పాను.

తటపట లాడుతున్న చినుకుల్నీ, ఝుంయ్ మంటూన్న గాలినీ, తీక్షణంగా లేస్తున్న దుమారాన్నీ చీల్చుకుంటూ యింటి దిక్కుగా నడిచాం. ఇద్దరమూ తడిసి ముద్ద అయి యిల్లు జేరుకున్నాం.

ఎదురు చూస్తున్న తన తల్లితో, "మామయ్య వన్నీ అబద్ధాలే! పంది శకునం మంచిదన్నాడు. అదే యింత పని చేసింది," అని శేషు అంది, వరికిణా నీళ్ళు పిండుకుంటూ.

(జూలై 1942)

---

# పెన్సిల్

అమ్మా నాన్నా అలా మూతులు ముడుచుకు కూచోడం వసంత్‌కి నచ్చలేదు. వీళ్ళపోట్లాటలు కాదుగాని తల ప్రాణం తోకకి వస్తోంది. ఇద్దరి మధ్యా నలిగి తను నానాయిడీ అయిపోతున్నాడు.

తన పెన్సిల్ పోయిందనీ కొత్తపెన్సిల్ కావాలనీ అమ్మతో చెప్పాడు. "నాకు తెలీదు—మీనాన్నని అడుగు," అనిబుస్సుమంది. నాన్న దగ్గిరికి వెళ్ళి "నాన్నా నాన్నా, నాకుపెన్సిల్ కావాలి" అంటే, "వెధవా, యిన్నాళ్ళనుంచీ పెన్సిళ్లు నేనిస్తున్నానా! నువ్వుకూడా అమ్మపక్షం చేరి నాటక మాడుతున్నావా"? అని కస్సుమన్నాడు.